క్లుప్తంగా

మారెమ్మ తల్లికి రాహుకేతు పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయం 10–30 నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. నెయ్యిదీపాలు, చలిపిండి, చల్లముద్ద పెట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం



పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె పీహెచ్‌సీకి వైద్య పరీక్షల నిమిత్తం విచ్చేసిన గర్భిణులకు శుక్రవారం మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి విజయ్‌చంద్ర మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే రోగ నిరోధక శక్తి లభించడంతోపాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలు అధిక మోతాదులో తీసుకోవాలని తెలిపారు. డాక్టర్లు సూచించిన విధంగా వ్యాయామం కూడా చేయాలని పేర్కొన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పుంగనూరు: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండలంలోని ముడిబాపనపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి తెలిపారు. శుక్రవారం నేతిగుట్లపల్లె ప్రాజెక్టు వద్ద వైద్య శిబిరం నిర్వహించి, 36 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా ప్రతి ఒక్కరు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో మురళి, సూపర్ వైజర్ హరిప్రసాద్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ అబీద్‌అలి, సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

సదుం: మండలంలోని ఊటుపల్లె పంచాయతీ చల్లావారిపల్లె శ్రీకోదండ రామస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు శనివారం ఉదయం నుంచి నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గణపతి ఆరాధన, వాస్తు పూజ, హోమం, కలిశస్థాపన, మహా కుంభాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సంతాపం

గంగవరం: మండలంలోని కల్లుపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణనాయుడు తల్లి పద్మమ్మ(85) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలిసిన వెంటనే శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు పట్టాభిరామయ్య, వేణురెడ్డి, గోపికృష్ణ తదితరులు సంతాపం తెలియజేసిన వారిలో ఉన్నారు.

మహిళల భద్రతకు భరోసా



కరపత్రాలను అందజేస్తున్న ఎస్‌ఐ రవికుమార్

చౌడేపల్లె: మహిళల భద్రతకు భరోసా కల్పించడమే 'ప్రతి గడపకు మహిళా పోలీస్' అని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. శుక్రవారం టీచర్స్‌కాలనీ గడప గడపకు మహిళా పోలీస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం ప్రయోజనాలను వివరించారు. మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యలు వస్తే ఎలా ఫిర్యాదు చేయాలి, సైబర్ నేరాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఆపద సమయాల్లో మహిళలు 1902, 1930 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం కింద మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. తద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం



ఉత్తమ అవార్డు అందుకున్న బొమ్మయ్యగారిపల్లె సచివాలయం

పథకం	లబ్ధిదారులు	అందుతున్న లబ్ధి
అమ్మఒడి	3,185 మంది	రూ.4.77 కోట్లు
వైఎస్సార్ పింఛన్	4,502 మంది	రూ.12,18 కోట్లు
వైఎస్సార్ చేయూత	1,544 మంది	రూ.2.89 కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	4,277 మంది	రూ.3.61 కోట్లు
వైఎస్సార్ కాపు నేస్తం	115 మంది	రూ.17.30 లక్షలు
వైఎస్సార్ వాహనమిత్ర	173 మంది	రూ.17.30 లక్షలు
జగనన్న విద్యా దీవెన	758 మంది	రూ,1.24 కోట్లు
జగనన్న చేదోడు	150 మంది	రూ. 15 లక్షలు
జగనన్న తోడు	450 మంది	రూ.45 లక్షలు
ఈబీసీ నేస్తం	431 మంది	రూ.64 లక్షలు
వైఎస్సార్ ఆసరా	597 మంది	రూ.11.42 కోట్లు

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. ప్రజలు సులభతరంగా ప్రభుత్వ సేవలు అందుకుంటున్నారు. 2019 అక్టోబర్ 2న ప్రారంభమైన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయి.

- సచివాలయ వ్యవస్థతో గడప గడపకూ ప్రభుత్వ సేవలు
- గ్రామాల్లోనే అందుతున్న 540 సేవలు
- కష్టాలు తప్పాయని గ్రామీణుల ఆనందం

మండలం వివరాలు

కుటుంబాలు	-	9186
సచివాలయాలు	-	8
సొంత భవనాలకు వెచ్చించిన ఖర్చు	-	రూ.3.20 కోట్లు
సచివాలయంలో సిబ్బంది	-	11 మంది
సచివాలయ పరిధిలో వలంటీర్లు	-	147 మంది

రొంపిచెర్ల: ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే సాధారణ పౌరులు ఎన్నో కష్టాలు పడేవారు. కొన్ని సేవలు పొందాలంటే మధ్యవర్తులను ఆశ్రయించి కొంత మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. సచివాలయ వ్యవస్థ రాకతో అటువంటి ఇబ్బందులు చెక్ పడింది. నిజమైన పేదలకు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి. సచివాలయాల్లో అందుతున్న సేవల పట్ల ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.

సంక్షేమ ఫలాలు అందించడంలో మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ సచివాలయం జిల్లాలో ఆరవ స్థానంలో ఉంది. ఉత్తమ గ్రామ సచివాలయంగా ఎంపికై అవార్డు అందుకుంది. ఈ పంచాయతీ సర్పంచ్ ఎన్నికపై కోర్టులో కేసు నడుస్తోంది. సర్పంచ్ లేక పోయిన అభివృద్ధిలో పరుగులు తీస్తుంది.

ఇంటి వద్దకే పథకాలు



సచివాలయాల ఏర్పాటుతో అన్ని రకాల ప్రభుత్వ సేవలు త్వరితగతిన గ్రామంలోనే లభిస్తున్నాయి. గతంలో మండల కేంద్రానికి వ్యవప్రయాసకోర్చి వెళ్లినా ఆరోజు పని అయ్యేది కాదు. పలుమార్లు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సచివాలయంలో రెవెన్యూ సేవలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పన్నుల చెల్లింపులు, పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి. పింఛన్ వలంటీర్ ఇంటికే తెచ్చిస్తున్నారు. నాకు అభయ హస్తం పథకంలో నెలకు రూ.500 వస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు తిరాగాల్సిన బాధ్యత తప్పింది. వృద్ధాప్యంలో జీవితం సాఫీగా సాగిపోతుంది.

- మాబున్ని, ఫజులుపేట

సదుపాయాల కల్పనే ధ్యేయం



ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. సచివాలయ వ్యవస్థ రాకతో అన్ని రకాల సేవలు ప్రజల చెంతకే అందుబాటులో వచ్చాయి. మొత్తం 540 రకాల సేవలు సచివాలయాల ద్వారా అందుతున్నాయి. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేంత వరకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సేవలన్నీ సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఎంపిక వేగంగా జరుగుతుంది.

హరిబాబు, సచివాలయ కార్యదర్శి

సంక్షేమమే అజెండాగా పాలన



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో సంక్షేమ లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శుక్రవారం పెద్దకాపల్లి పంచాయతీలోని తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె, ఎర్రమ్మచెరువు ఎస్టీకాలనీ, పెనుబలకల, పెద్దకాపల్లె, ముదిరెడ్డిపల్లెలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 600 గృహాలను సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాల అమలు ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఒక్కో ఇంటికి రూ.లక్షల్లో పథకాల లబ్ధి చేకూరిందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ఇప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. సంక్షేమ ఫలాలు పెద్ద ఎత్తున అందుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందడంతో ప్రభుత్వంపై ప్రజలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, స్థానిక సర్పంచ్ చంద్రమోహన్, ఎంపీటీసీ పావని, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, నాయకులు భాస్కర్ రెడ్డి, ఇంతియాజ్, అమరనాథరెడ్డి, సుబ్రమణ్యం, రాజా రెడ్డి, ఆంజప్ప, సురేంద్ర పాల్గొన్నారు.



కమ్మపాలెంలో సర్పంచ్ అరుణతో కలసి ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

రాయలపేట సచివాలయ పరిధిలోని కమ్మపాళెంలో రూ.సుమారు 22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. సాగుకు అవసరమైన సలహాలను నిపుణులతో అందిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి జగనన్న శ్రీకారం చుట్టారని తెలిపారు. అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మలాథిన్ పిచికారీ చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరమవుతాయని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఫీరూసాహెబ్ అన్నారు. జాతీయ మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని తగ్గువారిపల్లెలో ప్రజలకు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాలువలు, గృహాల వద్ద మలాథిన్ పిచికారీ చేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం ఫీరూసాహెబ్ మాట్లాడుతూ, నివాస గృహాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందవన్నారు. దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలని సూచించారు. తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి లోహిత్ చెంగల్‌రాయన్, ఎంపీహెచ్‌ఈఓ బృహస్పతి, డీపీఎంఓ మణి, ఆరోగ్య పర్యవేక్షకులు హరికృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి



రామకుప్పంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: తమ ప్రభుత్వం కులాలు, వర్గాలు, పార్టీలకతీతంగా..అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆనిగానూరు, రామకుప్పం మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. రామకుప్పం టౌన్‌లో అర్హులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జగనన్న లే అవుట్‌లో ఇంటి పట్టాలు మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆనిగానూరు, రామకుప్పం గ్రామాల్లో సీసీ రోడ్లు కావాలని స్థానికులు ఎమ్మెల్సీని కోరారు. ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని పలువురు కోరారు. ఆనిగానూరు సచివాలయ పరిధిలో ఉత్తమ సేవలందించిన 17 మంది వలంటీర్లను ఎమ్మెల్సీ భరత్ సత్కరించారు. సచివాలయంలో ప్రొహిబిషనరీ పూర్తి చేసిన ఇద్దరు ఉద్యోగులను సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌లు మురళీకృష్ణ, నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు సులోచన, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అప్పి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, నాయకులు తజీముల్ పాషా, కేశవరెడ్డి, గుర్రప్ప, వార్డు సభ్యులు అబ్దుల్, జమీను ప్రసాద్, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.



ఆనిగానూరులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ భరత్

సంక్రాంతి సెలవుల పెంపుపై హెచ్‌యూఎస్ హర్షం

తిరుపతి ఎడ్యుకేషన్ : సంక్రాంతి సెలవులను ముక్కనుమ వరకు పెంచడంపై హిందూ ఉపాధ్యాయ సమితి (హెచ్‌యూఎస్) జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జనవరి తొమ్మిది నుంచి 18వ తేదీ వరకు కనుమ, ముక్కనుమను కలుపుకుని సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్టు అకడమిక్ క్యాలెండర్ రూపొందించడంపై ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పండుగలు జరుపుకోవడమంటే మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడమేనని, ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి ఈ నెల 2వ తేదీన హెచ్‌యూఎస్ తీసుకెళ్లిందని తెలిపారు. తమ విన్నపాన్ని పరిశీలించి సానుకూలంగా స్పందిస్తూ అకడమిక్ క్యాలెండర్లో జనవరి 9 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించడం హర్షనీయమని వెల్లడించారు.

స్కూళ్లకు చేరిన జగనన్న విద్యాకానుక కిట్లు



గుడిపాల: గుడిపాల మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈఓ రామ్‌నాయక్ తెలిపారు. వీటిని 2,593 మందికి విద్యార్థులకు పాఠశాలల పునః ప్రారంభం రోజునే ఇస్తామన్నారు.

వినాయకుని సేవలో కర్ణాటక మంత్రి



చిత్రపటం అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక రాష్ట్ర మంత్రి మునియప్ప శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఏఈఓ అందజేశారు.

జగనన్న కాలనీకి కరెంట్ సౌకర్యం



ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతున్న సిబ్బంది

బైరెడ్డిపల్లె : గంగవరం మండలం చౌడిరెడ్డిపల్లె వైఎస్సార్ జగనన్న కాలనీలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఇచ్చారు. మొదటి విడతలో ప్రభుత్వం 30 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసింది. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి కావడంతో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ పార్వతమ్మతో కలిసి గతంలో ఎమ్మెల్యే వెంకటేగౌడకు లబ్ధిదారులు విన్నవించారు. వెంటనే కరెంట్ సరఫరా ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈమేరకు గతంలో ఏర్పాటు చేసిన స్తంభాలకు కరెంట్ తీగలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు



కళాకారులను సత్కరిస్తున్న ఉభయదారులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో వారం రోజులుగా మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్నచే హరికథ కాలక్షేపం, రాత్రి వీధి నాటక ప్రదర్శన చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి కీచకవధ నాటకాన్ని కళాకారులు రక్తికట్టించారు. శుక్రవారం సాయంత్రం ఉత్తర గోగ్రహణం కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నేటి నుంచి సీఐటీయూ రాష్ట్ర సమావేశాలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో శనివారం నుంచి 13వ తేదీ వరకు సీఐటీయూ రాష్ట్ర సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు తెలిపారు. ఆయన శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. సమావేశాల్లో సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

తిరుపతి అర్బన్: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ సైనార్ మధుబాల తెలిపారు. తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ గ్రేడ్–1 గ్రంథాలయంలో మే 8వ తేదీ నుంచి చేపట్టిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఆమె మాట్లాడుతూ శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిజజీవితంలో అనుసరించాలని సూచించారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా క్రమశిక్షణ పెరుగుతుందని వెల్లడించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.